జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

నల్గొండ

సూర్యాపేట - యాదాద్రి భువనగిరి

బుధవారం 09 సెప్టెంబర్ 2026 పేజీలు:17






## ప్రైవేటు పాఠశాలల బలోపేతానికి నూతన కమిటీ

- అధ్యక్షుడిగా చెరుకు లింగస్వామి ఎన్నిక

**పోచంపల్లి, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి):**

ప్రైవేటు పాఠశాలల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సంఘటితంగా కృషి చేయాలని బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నాయకులు పిలుపునిచ్చారు.

వివరాలు 2లో



## 5 వేల బైకులు..

# 11 వేల మందితో దేవరకొండ దద్దరిల్లింది!

- 1000 రోజుల ప్రజాపాలన పూర్తి చేసిన సందర్భంగా ప్రజా వికాస ర్యాలీ
- కాంగ్రెస్ ప్రజా పాలనకు ప్రజలే సాక్ష్యం - వెయ్యి రోజుల అభివృద్ధిని ప్రజల ముందుంచాం ఎమ్మెల్యే బాలు నాయక్- కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితం..
- కేటీఆర్, హరీష్ రావులది గాలి మాటల రాజకీయం- దేవరకొండలో BRSకు ప్రజలే బైబై చెప్పారు

**దేవరకొండ, సెప్టెంబర్ 08, (ప్రజా జ్యోతి) :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా వికాస ర్యాలీ విజయవంతంగా జరిగింది.దేవరకొండ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం (మార్కెట్ యార్డు) నుంచి బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు సాగిన భారీ ర్యాలీలో 5 వేల బైకులు, 11 వేల మందికి పైగా నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

మిగతా 2 లో

# దళిత వ్యతిరేకి బి ఆర్ ఎస్ పార్టీ అని మరోసారి రుజువైంది

- కేసీఆర్ ఆదేశాలతో ప్రజా సమస్యలు వదిలి, చిల్లర వేషాలతో అల్లరి చేస్తున్న నాయకులు
- ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ - స్పీకర్ పై తాతా మధు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మిర్యాలగూడలో దళిత సంఘాలు, కాంగ్రెస్ నాయకుల భారీ నిరసన ర్యాలీ
- బి ఆర్ ఎస్ నాయకుల దిష్టిబొమ్మ దగ్ధం




**మిర్యాలగూడ, సెప్టెంబర్ 08,(ప్రజాజ్యోతి):**

దళిత ముఖ్యమంత్రి అంటూ, గద్దెనెక్కి దళితులను దగా చేసిన అప్పటి బీఆర్ఎస్ పార్టీ, దళిత స్పీకర్ ను ఘోరం గా మాట్లాడి టిఆర్ఎస్ దళిత వ్యతిరేక పార్టీని మరోసారి నిరూపించుకుందని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) అన్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నతగౌరవప్రదమైన స్థానాల్లో ఒకటైన తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ గపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన అసభ్యకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ మంగళవారం మిర్యాలగూడ పట్టణం లో ఎమ్మెల్యే ఆధ్వర్యం లో దళిత సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని భారీ నిరసన ర్యాలీ చేపట్టారు.

మిగతా 2 లో

# స్పీకర్‌ను అవమానించిన ఎమ్మెల్సీ తాతా మధును బర్తరఫ్ చేయాలి

- బహిరంగ క్షమాపణ చెప్పాలి..

భవిష్యత్‌లో రాజ్యాంగ పదవులు దక్కకుండా చర్యలు తీసుకోవాలినడిగూడెం సర్పంచ్ దున్నా శ్రీనివాస్ డిమాండ్

**నడిగూడెం, సెప్టెంబర్ 8 (ప్రజా జ్యోతి)**



శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను అసభ్య పదజాలంతో దూషించి, అవమానపరిచిన ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే బర్తరఫ్ చేయాలని నడిగూడెం సర్పంచ్ దున్నా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. ఎమ్మెల్సీ తాతా మధు వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.స్పీకర్‌ను అవమానించడం అంటే రాజ్యాంగ వ్యవస్థను, సభ్య సమాజాన్ని అవమానించినట్లేనని శ్రీనివాస్ పేర్కొ న్నారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న ప్రజాప్రతినిధులు ఇతరుల మనోభావాలను దెబ్బతీయకుండా హుందాగా వ్యవహరించాలని సూచించారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్‌లో తాతా మధుకు రాజ్యాంగపరమైన పదవులు దక్కకుండా తగిన చర్యలు చేపట్టాలని సర్పంచ్ దున్నా శ్రీనివాస్ కోరారు.

# గణేష్ మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

- వలిగొండ ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

**వలిగొండ సెప్టెంబర్ 08(ప్రజా జ్యోతి న్యూస్)**




వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి గణేష్ మండపాల నిర్వాహకులకు సూచించారు. మండపాల ఏర్పాటుకు పోలీస్, విద్యుత్ శాఖ, గ్రామ పంచాయతీ అధికారుల నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా రోడ్లపై మండపాలు ఏర్పాటు చేయరాదన్నారు. ధ్వని కాలుష్య నిబంధనలు పాటించాలని, డీజేల వినియోగంపై నిబంధనలు కఠినంగా అమలు చేస్తామని హెచ్చరించారు.ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు రాత్రివేళల్లో ఇద్దరు లేదా ముగ్గురు నిర్వాహకులు భద్రతగా ఉండాలని సూచించారు. శోభాయాత్ర సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

# ప్రైవేటు పాఠశాలల బలోపేతానికి నూతన కమిటీ

మొదటిపేజీ తరువాయి

పోచంపల్లిలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడాల జలందర్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెరుకు లింగస్వామి, కోశాధికారిగా ఎన్. సంజయ్ కుమార్, సెక్రటరీగా బుగ్గ లింగస్వామి ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఇటీవల మున్సిపల్ కౌన్సిలర్‌గా నియమితులైన కరస్పాండెంట్ రావుల జంగయ్యను, నూతన కమిటీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చిట్టిబాబు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నోముల బస్వారెడ్డి, జిల్లా కోశాధికారి ప్రభాకర్ రెడ్డి, జిల్లా నాయకులు మల్లేశం, కృష్ణంరాజు, జానీతో పాటు వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

# 5 వేల బైకులు.. 11 వేల మందితో దేవరకొండ దద్దరిల్లింది!

మొదటిపేజీ తరువాయి

భారీ జనసందోహంతో దేవరకొండ పట్టణం కాంగ్రెస్ శ్రేణుల నినాదాలతో మార్మోగింది.

**ఇది ర్యాలీ కాదు.. కాంగ్రెస్ అభివృద్ధికి ప్రజల మద్దతు**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ.. దేవరకొండలో కనిపించిన ఈ జనసంద్రం కాంగ్రెస్ ప్రజా పాలనకు ప్రజలు ఇచ్చిన మద్దతుకు నిదర్శనం. ఇది కేవలం బైక్ ర్యాలీ కాదు.. వెయ్యి రోజుల పాలనలో చేసిన అభివృద్ధికి ప్రజల ముందుంచిన అభివృద్ధి నివేదిక. మా దగ్గర మాటలు మాత్రమే కాదు.. పనులు, గణాంకాలు, రికార్డులు ఉన్నాయి అన్నారు.

**రైతు సంక్షేమానికి పెద్దపీట**

దేవరకొండ నియోజకవర్గంలో రూ.369 కోట్ల రైతు రుణమాఫీ జరిగిందని తెలిపారు. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందించామని చెప్పారు.ఎస్ ఎల్ బి సి, డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను వేగవంతం చేసి చివరి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యమన్నారు.

**పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం**

నియోజకవర్గంలో 15 వేల కొత్త రేషన్ కార్డులు అందించామని, ప్రతి యూనిట్‌కు నెలకు 6 కిలోల సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. అలాగే 32,127 కుటుంబాలకు గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందుతోందని, దాదాపు 3 వేల ఇందిరమ్మ ఇళ్లు పూర్తయి గృహప్రవేశాలకు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.మహిళలకు ఉచిత ప్రయాణం.. విద్యార్థులకు మెరుగైన విద్య మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ఆర్టీసి ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని, దేవరకొండ డిపో పరిధిలో ఇప్పటివరకు రూ.156 కోట్లు ఆర్టీసీకి చెల్లించారని తెలిపారు.కులుమంతలపహాడ్ వద్ద రూ.200 కోట్ల యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, దేవరకొండ ప్రభుత్వ హైస్కూల్‌ను తెలంగాణ పబ్లిక్ స్కూల్ గా అభివృద్ధి చేయడం, ఐటిఐని అడ్వాన్సుడ్ ట్రైనింగ్ సెంటర్ గా మార్చడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు.252 కిలోమీటర్ల రోడ్లు.. రూ.422 కోట్ల అభివృద్ధి పనులు ఆర్ అండ్ బి ద్వారా 137 కిలోమీటర్లకు రూ.272 కోట్లు, పంచాయతీరాజ్ ద్వారా 115 కిలోమీటర్లకు రూ.150 కోట్లు.. మొత్తంగా 252 కిలోమీటర్ల రహదారి అభివృద్ధికి రూ.422 కోట్ల పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు.

**బీ=ఆకు ప్రజలే బైబై చెప్పారు**

గత బిఆర్ఎస్ పాలనపై బాలు నాయక్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.పదేళ్ల అధికారంలో ఉన్న బిఆర్ఎస్ నాయకులు ప్రజలకు చేసిన పనులపై సమాధానం చెప్పాలి. కేసీఆర్ ప్రజల మధ్య ఉండాల్సింది. పోయి ఫాంహౌస్‌కు పరిమితమయ్యారు. కేటీఆర్, హరీష్ రావులు గాలి మాటలు మాట్లాడుతున్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు అని అన్నారు.దళితులకు మూడెకరాల భూమి ఏమైంది? ప్రతి ఇంటికి ఉద్యోగం ఏమైంది? డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఎక్కడ? గతంలో ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారు? అని ప్రశ్నించారు.

**చేసిన పనికి కీర్తి రావాలి.. చేయని పనికి కీర్తి అడగొద్దు**

ఎవరి హయాంలో ఏ పని జరిగిందో జీవోలు, శాంక్షన్లు, రికార్డులు చెబుతాయి. మాటలతో చరిత్ర మార్చలేరు. చేసిన పనికి కీర్తి రావాలి.. చేయని పనికి కీర్తి అడగకూడదు అని బాలు నాయక్ అన్నారు.వెయ్యి రోజుల పాలన అంటే క్యాలెండర్‌లో ఒక సంఖ్య కాదు.. ప్రజల జీవితాల్లో కనిపిస్తున్న మార్పు. గతాన్ని రికార్డులతో చూద్దాం.. వర్తమానాన్ని పనులతో చూద్దాం.. భవిష్యత్తును ప్రణాళికతో నిర్మిద్దాం. అభివృద్ధి కాగితాలపై కాదు.. ప్రజల జీవితాల్లో కనిపించాలి. అని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ స్పష్టం చేశారు.

# దళిత వ్యతిరేకి బి ఆర్ ఎస్ పార్టీ అని మరోసారి రుజువైంది

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి పట్టణంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు డప్పులతో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ చేతిలో భారత రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకొనిమాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ని అవమానించే విధంగా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు.అనంతరం బీఆర్ఎస్ నాయకుల అహంకార ధోరణికి నిరసనగా కేటీఆర్, హరీష్ రావు, తాతా మధుసూదన్‌ల దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేమాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పార్టీ పాత్ర అత్యంత ప్రధానమైనది కానీ తెలంగాణలో మాత్రం ప్రతిపక్ష బీఆర్ఎస్ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందన్నారు.ప్రజల సమస్యలపై మాట్లాడాల్సింది పోయి తమ స్వార్థ రాజకీయాల కోసం అసెంబ్లీ ని వేదికగా చేసుకునే ప్రయత్నం చేస్తుందన్నారు. సభ బయట అరాచకం చేస్తున్నారన్నారు.ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ సభకు రాడు, ఎమ్మెల్యేలను ఫామ్ హౌస్ కి పిలిచి అసెంబ్లీలో అల్లరి చేయమని చెప్పి పంపించాడని ఆరోపించారు.ముందస్తు వ్యూహంతో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్ల చొక్కాలపై పిచ్చి రాతలు రాసుకొని వచ్చి అల్లరి సృష్టించే ప్రయత్నం చేశారన్నారు.నల్ల చొక్కాలపై ఇష్టాను సారంగా రాతలు రాసుకొని సభలోకి వస్తే అసెంబ్లీ గౌరవం పోతుందని, దీనిపై స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని,ఇదంతా తెలిసి కూడా ఉద్దేశ పూర్వకంగా నల్ల చొక్కాలతో అసెంబ్లీకి వచ్చారని,భద్రతా సిబ్బంది నిలువరించే ప్రయత్నం చేశారన్నారు.కానీ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు భద్రతా సిబ్బందిపై దౌర్జన్యం చేశారని,అనేకమంది పోలీసులపై దాడి చేశారన్నారు.కేటీఆర్, కౌశిక్ రెడ్డి నేరుగా పోలీసులపై చేయి చేసుకున్నట్టు విడియోలో స్పష్టంగా కనిపిస్తుందన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు స్పీకర్ పై అత్యంత అనుచిత భాషను ఉపయోగించి దూషించారని,సభాపతిగా స్పీకర్ కి ప్రతి సభ్యులు గౌరవం ఇవ్వాల్సిందేనన్నారు. స్పీకర్ను గౌరవించకపోతే మొత్తం సభను అవమానించినట్టేనన్నారు.బిఆర్ఎస్ ఎమ్మెల్సీ ఉపయోగించిన భాష సభ్యసమాజం తలదించుకునేలా ఉందని,ఇలాంటి భాషను వాడిన ఎమ్మెల్సీ తాతా మధు పై చర్యలు తీసుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు.బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఎమ్మెల్సీ తాత మధు తీరుపై స్పందించాలని, బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందేనని అన్నారు.గతంలో కూడా బిఆర్ఎస్ సభ్యులు పలుసార్లు స్పీకర్ పట్ల ఇలాంటి అనుచిత ప్రవర్తనకు పాల్పడ్డారని,అయినా స్పీకర్ పెద్ద మనసుతో క్షమించారు కానీ ఈసారి మాత్రం తాతా మధు పై చర్యలు తీసుకోవాల్సిందేనన్నారు.బిఆర్ఎస్ పార్టీ మొదటి నుంచి దళిత వ్యతిరేక పార్టీఅని గతంలో డిప్యూటీ సీఎం పదవి నుంచి రాజయ్య అకారణంగా కేసీఆర్ తొలగించి అవమానించారని,ఆయనను ఎందుకు పదవి నుంచి తొలగించారో ఇప్పటివరకు సమాధానం చెప్పలేదన్నారు.గత సెషన్ లో బిఆర్ఎస్ సభ్యుడు పాడికౌశిక్ రెడ్డి సీనియర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పై అత్యంత పరుష పదజాలంతో వ్యాఖ్యలు చేశారన్నారు.కడియం వైపు చూస్తూ చంపేస్తానని సైగలతో బెదిరించారని,ఇప్పటికే ఆయన తీరుపై ఎథిక్స్ కమిటీ విచారణ జరుగుతుందన్నారు.ఇప్పుడు అదే పార్టీకి చెందిన ఎమ్మెల్సీ తాత మధు స్పీకర్ ని ఉద్దేశించి అత్యంత నీచంగా మాట్లాడారు దళిత వ్యతిరేక డిఎన్ఏ బిఆర్ఎస్ పార్టీలోనే ఉందన్నారు.ఇలాంటి వాళ్లను ఎంత మాత్రం ఉపేక్షించవద్దని,కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా సభా గౌరవానికి భంగం వాటిల్లనివ్వమని సంకేతాలు ఫలంగా పంపినట్లవుతుందని ఈ సందర్భంగా స్పీకర్ ని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు,నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు..

# మేళ్ల దుప్పలపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ..

## - అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలి...బోగరి అనిల్ కుమార్



**నల్గొండ రూరల్ సెప్టెంబర్ 8,(ప్రజా జ్యోతి):**

నల్గొండ మండలం మేళ్ల దుప్పలపల్లి గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కోమటిరెడ్డి సంధ్యారాణి నరసింహారెడ్డి , ఉపసర్పంచ్ మణిమద్దె అనూష, పంచాయతీ కార్యదర్శి ధరణి తో కలిసి వార్డు సభ్యుడు, బీజేపీ నల్గొండ మండల అధ్యక్షుడు బోగరి అనిల్ కుమార్ అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా బోగరి అనిల్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజమైన అర్హులకు చేరేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని అన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు.గ్రామంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



---

# పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

## - 4 ఏళ్ల 9 నెలలుగా పెండింగ్‌లో ఉన్న 120 మంది కార్మికుల పీఎఫ్ చెల్లింపులకు నిర్ణయం

## - సూర్యాపేట కొత్త మాస్టర్ ప్లాన్‌కు మున్సిపల్ జనరల్ బాడీ ఆమోదం - 60 ఫీట్ల రోడ్డు నుంచి కలెక్టరేట్‌కు అనుసంధాన రహదారిపై కీలక నిర్ణయం

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 08(ప్రజా జ్యోతి):**

సూర్యాపేట పట్టణ అభివృద్ధి,మౌలిక వసతుల కల్పనతో పాటు పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి మున్సిపల్ కౌన్సిల్ పెద్దపీట వేసింది.మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు.





### 120 మంది కార్మికుల పీఎఫ్‌కు పరిష్కారం

పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి సంబంధించి సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు.గత 4 సంవత్సరాల 9 నెలలుగా పీఎఫ్ చెల్లింపులు పెండింగ్‌లో ఉన్న 120 మంది పారిశుద్ధ్య కార్మికుల పీఎఫ్ మొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేయాలని కౌన్సిల్ నిర్ణయించింది.కార్మికుల హక్కులు,సంక్షేమాన్ని పరిరక్షించేందుకు మున్సిపాలిటీ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు.అలాగే పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి సంవత్సరం అందించే సబ్బులు, దుస్తులు, కొబ్బరి నూనె తదితర సంక్షేమ సామగ్రిని అందించాలని కార్మికులు ఇటీవల చైర్‌పర్సన్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.కార్మికుల విజ్ఞప్తిపై స్పందించిన చైర్‌పర్సన్ ఈ అంశాన్ని జనరల్ బాడీ ఎజెండాలో పొందుపరచగా,కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

### కొత్త మాస్టర్ ప్లాన్‌కు ఆమోదం

సూర్యాపేట పట్టణ సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రూపొందించిన కొత్త మాస్టర్ ప్లాన్‌కు జనరల్ బాడీ ఆమోదం తెలిపింది.పట్టణ విస్తరణ,రహదారులు,మౌలిక వసతులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని రూపొందించిన మాస్టర్ ప్లాన్ భవిష్యత్ పట్టణ అభివృద్ధికి దోహదపడుతుందని సమావేశంలో పేర్కొన్నారు.

### కలెక్టరేట్‌కు అనుసంధాన రహదారి

సూర్యాపేటలోని 60 ఫీట్ల రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు అనుసంధాన రహదారి ఏర్పాటు అంశంపై సమావేశంలో చర్చించారు.ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కలిసి అందించాలని నిర్ణయించారు.ఈ రహదారి పూర్తయితే పట్టణ ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు కలెక్టరేట్‌కు చేరుకునే మార్గం మెరుగుపడుతుందని తెలిపారు.

### అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు వేగవంతం



పట్టణంలో కొనసాగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కౌన్సిల్ నిర్ణయించింది.పనులను వేగవంతం చేసి,నిర్మాణ పనుల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వీలైనంత త్వరగా తొలగించేలా చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ షఫీ ఉల్లా,ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్‌తో పాటు కౌన్సిలర్లు పట్టణ అభివృద్ధి,ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు,పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమంపై పలు సూచనలు చేశారు.మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి, అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.పట్టణ ప్రజల అవసరాలు,కార్మికుల సంక్షేమం,సూర్యాపేట భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కౌన్సిల్ సమిష్టిగా నిర్ణయాలు తీసుకుంటోందని చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది తెలిపారు.సూర్యాపేటను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు మున్సిపాలిటీ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు.

# గణేష్ ఉత్సవాల్లో డీజేలకు బ్రేక్!

## - నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవు
## - డీజే యజమానులకు చివ్వెంల ఎస్సై హెచ్చరిక

**చివ్వెంల సెప్టెంబర్ 08(ప్రజాజ్యోతి):**



వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల వేళ డీజేల వినియోగంపై పోలీసులు కఠినంగా వ్యవహరించనున్నారు.గణేష్ ఉత్సవాలు, శోభాయాత్రలు,నిమజ్జన కార్యక్రమాల్లో డీజే సిస్టమ్‌లను వినియోగించరాదని చివ్వెంల ఎస్సై స్పష్టం చేశారు.ఈ మేరకు పోలీస్‌స్టేషన్ పరిధిలోని డీజే సిస్టమ్ యజమానులతో ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించి,నిబంధనలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఉత్సవ కమిటీలు,శోభాయాత్రలు,నిమజ్జన కార్యక్రమాలకు డీజే సిస్టమ్‌లను అద్దెకు ఇవ్వడం,సరఫరా చేయడం లేదా వినియోగించడం చేయరాదని ఆదేశించారు.ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా డీజేలను ఏర్పాటు చేసినా,సరఫరా చేసినా సంబంధిత వ్యక్తులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలను పాటించేలా పోలీస్‌స్టేషన్ పరిధిలోని డీజే యజమానులందరినీ బౌండ్‌ఓవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో,ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు నిర్వాహకులు, భక్తులు పోలీసులకు సహకరించాలని కోరారు.

# తాతా మధు దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలి

**నకిరేకల్: సెప్టెంబర్ 8 ప్రజా జ్యోతి**

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం నకిరేకల్ మండల కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తాతా మధు చేసిన వ్యాఖ్యలు దళిత సమాజాన్ని అవమానించేలా ఉన్నాయని అన్నారు. ఈ వ్యాఖ్యలకు తాతా మధు వెంటనే దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నట్లు దైద రవీందర్ తెలిపారు.



# ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ వినతి







**నకిరేకల్, సెప్టెంబర్ 8: ప్రజాజ్యోతి**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు చేపట్టిన ఏడు రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతు భరోసా, కౌలు రైతులకు సహాయం, నిరుద్యోగులకు ఉద్యోగాలు, విద్యార్థులకు విద్యానిధి, పెండింగ్ ఫీజు బకాయిల చెల్లింపు, పెన్షన్లు తదితర హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులపై పోలీసు కేసులు పెట్టి నిరసనలను అణచివేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన నిరసన తెలిపే హక్కును, ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును కాపాడాలని అంబేద్కర్ విగ్రహం సాక్షిగా విజ్ఞప్తి చేశారు.ప్రజల గొంతును అణచివేయకుండా ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

# అంగన్‌వాడీ పోస్టుల తాత్కాలిక జాబితా విడుదల

## - అభ్యంతరాల స్వీకరణకు మూడు రోజుల గడువు

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 08(ప్రజా జ్యోతి):**

సూర్యాపేట జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు (ఏ డబ్ల్యు టి ),అంగన్‌వాడీ ఆయా (ఏ డబ్ల్యు హెచ్) పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా తాత్కాలిక ఎంపిక జాబితాను విడుదల చేసినట్లు జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి తెలిపారు.జిల్లాలోని ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు,ఆయా పోస్టులకు వచ్చిన దరఖాస్తులపై ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేసిన అనంతరం అర్హులైన,అనర్హులైన అభ్యర్థుల తాత్కాలిక జాబితాను సిద్ధం చేశారు.ఈ జాబితాలను సంబంధిత గ్రామ పంచాయతీ,మున్సిపాలిటీ పరిధిలోని వార్డు కార్యాలయాల్లో నోటీసు బోర్డులపై ప్రదర్శించినట్లు పేర్కొన్నారు.

**అభ్యంతరాలకు 3 రోజుల గడువు**

తాత్కాలిక జాబితాపై అభ్యంతరాలు ఉన్న అభ్యర్థులు 09-09-2026 నుంచి 11-09-2026 సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సీడీపీఓ కార్యాలయంలో రాతపూర్వక దరఖాస్తుతో పాటు అవసరమైన ఆధారాలను సమర్పించాలని అధికారులు సూచించారు.గడువు ముగిసిన అనంతరం అందే అభ్యంతరాలను స్వీకరించబోమని స్పష్టం చేశారు.అభ్యంతరాల పరిశీలన అనంతరం అర్హత నిబంధనల ప్రకారం తదుపరి ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.అర్హత ఉన్న అభ్యర్థులు తాత్కాలిక జాబితాను పరిశీలించి,తమకు సంబంధించిన వివరాల్లో ఏమైనా అభ్యంతరాలు ఉంటే నిర్ణీత గడువులోపు ఆధారాలతో సమర్పించాలని అధికారులు సూచించారు.

# పరిశ్రమలు వద్దు.. ప్రజల ప్రాణాలే ముద్దు

## - నేడే కలెక్టరేట్ ఎదుట సీపీఎం ధర్నా

**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి):** మండల పరిధిలోని దోతిగూడెం, అంతమ్మగూడెం గ్రామాల సమీపంలో ఉన్న ప్రమాదకర కెమికల్ పరిశ్రమలను గ్రామాల నుంచి తరలించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి తెలిపారు.మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఆయా గ్రామాల ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల కాలుష్యంతో గ్రామాల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, భూములు కలుషితమై వ్యవసాయ పంటలు సరిగా పండడం లేదని ఆరోపించారు. ప్రజల ప్రాణాలకు హాని కలిగించే పరిశ్రమలను గ్రామాల నుంచి తరలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నాకు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోట రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు.



# ప్రజా పాలనా..? ఎమర్జెన్సీ పాలనా..?

# కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై దేవరకొండ

## - మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ తీవ్ర ఆగ్రహం

**దేవరకొండ, సెప్టెంబర్ 08, (ప్రజా జ్యోతి) :** కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీసుల తీరుపై దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అక్రమంగా హౌస్ అరెస్టులు చేస్తూ.. మరోవైపు ప్రతిపక్ష నేత కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం వైపు దాడికి వెళ్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలను పోలీసులు ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నించారు.అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాల్సిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గౌరారం వద్ద ఎందుకు కాపు కాస్తున్నారని, కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం వద్ద కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఏం పని అని రమావత్ రవీంద్ర కుమార్ ప్రశ్నించారు. కవ్వంపల్లి సత్యనారాయణను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని నిలదీశారు.కేసీఆర్ పై దాడికి కంటైనర్లలో ఎమ్మెల్యేలు, కార్యకర్తలను తరలిస్తున్నా పోలీసులు చోద్యం చూస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రతిపక్ష నేత ఇంటిపై దాడికి ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హింసను ప్రేరేపిస్తున్నారా అని నిలదీశారు.ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను హౌస్ అరెస్టులు చేయడం, అధికార పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలను మాత్రం స్వేచ్ఛగా వదిలేయడం ఏ విధమైన ప్రజాస్వామ్యమని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల నిరసనకు ఒక న్యాయం, అధికార పార్టీకి మరో న్యాయమా అని మండిపడ్డారు.ముఖ్యమంత్రి



డైరెక్షన్‌లోనే కేసీఆర్ పై దాడికి కుట్ర జరుగుతోందని రమావత్ రవీంద్ర కుమార్ ఆరోపించారు. హోం శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో శాంతిభద్రతలను సర్వనాశనం చేస్తున్నారని విమర్శించారు. ప్రజా పాలన ముసుగులో పోలీసుల రాజ్యం నడుస్తోందని ధ్వజమెత్తారు.కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం వద్ద జరుగుతున్న పరిణామాలపై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నేతపై దాడికి కుట్ర జరుగుతున్నా ప్రభుత్వం, పోలీసులు పట్టించుకోకపోవడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమన్నారు.అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా వ్యవహరించడం మానుకోవాలని రమావత్ రవీంద్ర కుమార్ హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీసుల ఈ దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.


# భువనగిరి లో ఇళ్ళు కూలి వృద్ధురాలికి స్వల్ప గాయాలు

## - నిర్లక్ష్యంగా వదిలి వెళ్ళిన కుమారుడిపై చర్యలకు డిమాండ్

## - వృద్ధురాలిని సహృదయ ఆశ్రమం లో చేర్పించిన సామాజిక కార్యకర్తలు

**భువనగిరి సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి)** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై ఇంటి పైకప్పు కూలి ,స్వల్ప గాయాలతో బయటపడ్డ సంఘటన మంగళవారం భువనగిరి పటణంలోని సమ్మద్ చౌరస్తా లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బచ్చు సక్కుబాయి ( వయస్సు సుమారు 100 సంవత్సరాలు) భువనగిరి సమ్మద్ చౌరస్తా లో తన స్వంత ఇంట్లో ఒంటరిగా ఉంటుంది. తనకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నట్లు సక్కుబాయి చెబుతుంది. సక్కుబాయి ఆలనాపాలనా చూడడానికి ఒక కేర్ టేకర్ ను ఏర్పాటు చేసినట్టు కుమారుడు బచ్చు నరేందర్ తెలిపాడు. ఏదిఏమైనా నూరు సంవత్సరాల వయస్సు గల సక్కుబాయి ని ఒంటరిగా వదిలి వెళ్ళిన కుమారుడిపై వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం -2007 ప్రకారం చర్యలు తీసుకోవాలని భువనగిరి సామాజిక కార్యకర్తలు కొడారి వెంకటేష్, మహ్మద్ ఇంతియాజ్ లు మంగళవారం భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ , ఇంతియాజ్ మాట్లాడుతూ ప్రమాదంలో వృద్దురాలు ఆరుబయట కూర్చుంది కాబట్టి పెద్ద ప్రమాదం తప్పిందని వారున్నారు. రెండు సంవత్సరాల క్రితమే శిథిలావస్థకు చేరిన ఇళ్ళను స్వచ్ఛందంగా కూల్చి వేయాలని మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కుమారుడు పై చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్తలు కొడారి వెంకటేష్, మహ్మద్ ఇంతియాజ్, చల్ల గురుగుల రఘుబాబు, బొబ్బిలి ఉమా మహేశ్వర్ల లు డిమాండ్ చేశారు. సామాజిక కార్యకర్తలు వృద్ధురాలిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి కి సమాచారం అందింది రాయగిరి లోని సహృదయ అనాధ వృద్ధాశ్రమం లో సక్కుబాయి ని చేర్పించారు. ఏది ఏమైనా పండుటాకులాంటి సక్కుబాయి కి దగ్గర ఉండి సేవలు చేయాల్సిన కుమారుడు, కుమార్తె లపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.





# 104 గ్రాముల గంజాయి స్వాధీనం ఇద్దరు యువకులు అరెస్ట్

## - సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్

**ఆత్మకూర్ (ఎస్),సెప్టెంబర్ 08 (ప్రజాజ్యోతి):**

గంజాయిని అక్రమంగా కలిగి ఉన్న ఇద్దరు యువకులను ఆత్మకూరు (ఎస్) పోలీసులు అరెస్ట్ చేశారు.వారి వద్ద నుంచి 104 గ్రాముల గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్లు,ఒక మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటన సూర్యాపేట రూరల్ సర్కిల్ పరిధిలోని రామన్నగూడెం గ్రామంలో చోటుచేసుకుంది.సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం విశ్వసనీయ సమాచారం మేరకు ఆత్మకూరు (ఎస్) పోలీసులు రామన్నగూడెం గ్రామంలో తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా గంజాయితో పట్టుబడిన అదే గ్రామానికి చెందిన అల్లిపురి అఖిల్ (23), మట్టపల్లి గంగరాజు (22)లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు 104 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి,అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.ఈ మేరకు బుధవారం సూర్యాపేట రూరల్ సర్కిల్ కార్యాలయంలో అరెస్ట్ వివరాలను వెల్లడించారు.

**మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి**

యువత గంజాయి,ఇతర మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా



ఉండాలని సీఐ రాజశేఖర్ సూచించారు.మత్తు పదార్థాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు దెబ్బతింటుందని, చదువు, ఉద్యోగం, క్రీడలు వంటి సానుకూల మార్గాల్లో ముందుకు సాగాలని కోరారు. గంజాయి,డ్రగ్స్ విక్రయాలు,వినియోగంపై పోలీసు శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తోందని,అక్రమ రవాణా,విక్రయాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆత్మకూరు (ఎస్) ఎస్సై ఐలయ్యతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై బిఆర్ఎస్ పోరుబాట మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్

## - మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసుల దుర్మార్గపు ప్రవర్తనను సహించేది లేదు

## - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలి.

## - నల్గొండలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులు, వినతిపత్రం సమర్పణ

**దేవరకొండ, సెప్టెంబర్ 08,(ప్రజా జ్యోతి) :**

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజావ్యతిరేక విధానాలపై భారత రాష్ట్ర సమితి అధిష్టానం పిలుపు మేరకు చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో భాగంగా దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ నల్గొండలో మీడియా సమావేశంలో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై మరియు పోలీసుల తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీ ప్రాంగణంలో మరియు నిరసనల సందర్భంలో బిఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు. "మహిళా శాసనసభా నాయకుల చీరెలు లాగుతారా? మా పట్ల ఇంత దుర్మార్గంగా ప్రవర్తిస్తారా?" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.బిఆర్ఎస్ మహిళా నాయకురాలు సునితమ్మ చీర లాగిన పోలీసులను, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి గొంతు నొక్కిన పోలీసులను ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా ప్రజాప్రతినిధులకు జరిగిన ఈ అవమానానికి గానూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.అనంతరం, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 అబద్ధపు హామీలపై నిరసనగా రమావత్ రవీంద్ర కుమార్ పార్టీ శ్రేణులతో కలిసి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి, నోముల భగవత్ మరియు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# మహిళ ఎమ్మెల్యేలపై దాడిని నిరసిస్తూ హాలియాలో బీఆర్ఎస్ ధర్నా

**హాలియా,సెప్టెంబర్8(ప్రజా జ్యోతి)**

అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి,సునీత లక్ష్మారెడ్డిల జరిగిన దాడిని నిరసిస్తూ హాలియాలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ ఆధ్వర్యంలో హాలియా ప్రధాన సెంటర్ లో మంగళవారం మహిళా నాయకులు కార్యకర్తలు ధర్నా నిర్వహించారు.ఈ సందర్బంగా నోముల భరత్ కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి నిలయమైన అసెంబ్లీ ఆవరణలో మహిళ ప్రజా ప్రతినిధులపై దాడి జరగడం ఖండించాల్సిన విషయమని అన్నారు.ప్రజల తరపున ప్రశ్నించే ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై దాడులు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. మహిళ ఎమ్మెల్యేలపై దాడికి బాధ్యులైన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు,మహిళా ప్రజా ప్రతినిధులకు రక్షణ కల్పించాలి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, వర్ర వెంకటరెడ్డి,కర్నా నర్సిరెడ్డి, పొదిల శ్రీనివాస్,వడ్డే సతీష్ రెడ్డి, కౌన్సిలర్ 4వ వార్డు కౌన్సిలర్ కడమంచి ప్రమీల శ్రీను, నాగరాజు,బోల్లం సైదులు, కూరాకుల రవి,వర్ర గంగా భవాని మహిళ నాయకులు పాల్గొన్నారు.




# పుస్తక పఠనంపట్ల విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించాలి

## - కస్తూరి ప్రభాకర్

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 08,(ప్రజాజ్యోతి):**

అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ సందర్భంగా రూం టు రీడ్, మరో గ్రంథాలయ ఉద్యమ పిలుపులో భాగంగా తెలంగాణ వ్యాప్తంగామిర్యాలగూడ డివిజన్ లోని ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తక పఠనం పట్ల ఆసక్తిని పెంచడానికి సామూహిక పుస్తక , కథా, పద పఠన కార్యక్రమం మంగళవారం నిర్వహించారని మరో గ్రంథాలయ ఉద్యమ నిర్వాహకులు కస్తూరి ప్రభాకర్ తెలిపారు. ఆయా పాఠశాలల్లో టీచర్లు చదవడం, విద్యార్థులచే చదివించే కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. విద్యార్థుల్లో పఠన ఆసక్తి పెపొందించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గులాంఅహ్మద్ ఉన్నారు.



# ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలి

## - మిర్యాలగూడ డి.ఎస్.పి జీ. రవి

**హాలియా,సెప్టెంబర్8(ప్రజా జ్యోతి)**

గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సవాల నడుమ ఘనంగా జరుపుకోవాలని మిర్యాలగూడ డీఎస్పీ జి.రవి సూచించారు. వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని హాలియా పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, ప్రశాంత వాతావరణంలో డీజే శబ్దాలకు దూరంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గణేష్ మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేడుకలు జరుపుకోవాలని సూచించారు.ఉత్సవాలు, శోభాయాత్రలు నిమజ్జన కార్యక్రమాల సమయంలో పోలీసు శాఖతో సమన్వయం పాటిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. డీజే రహితంగా,ఆధ్యాత్మిక వాతావరణంలో గణేష్ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో హాలియా సీఐ ఎస్.రాఘవ రావు,హాలియా ఎస్ ఐ బి.సాయి ప్రశాంత్,గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.



# దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసన

## - తాత మధుసూదన్ పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి .

## ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈరసరపు యాదగిరి గౌడ్ డిమాండ్

**గుండాల, సెప్టెంబర్ 8(ప్రజా జ్యోతి) :**

యాదాద్రి భువనగిరి జిల్లా తుర్క పల్లి మండల కేంద్రంలో, జిల్లా కాంగ్రెస్అధ్యక్షులు,ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆధ్వర్యంలో నిర్వహించినమహాధర్నాలోభాగంగాఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈరసరపు యాదగిరిగౌడ్ మాట్లాడుతూ నిన్న అసెంబ్లీలో దళిత స్పీకర్‌పై బీఆర్ఎస్ఎమ్మెల్సీతాత మధుసూదన్ చేసిన అనుచిత, అవమానకర వ్యాఖ్యలు చేసిన అతనిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నతమైన శాసనసభలో స్పీకర్ పదవికి గౌరవం ఇవ్వాల్సిన బాధ్యతప్రతిప్రజాప్రతినిధిపై ఉందన్నారు. ముఖ్యంగా దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్‌ను కించ పరిచేలా మాట్లాడటం సరికాదని అన్నారు.ఇలాంటివ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలను, శాసన సభగౌరవాన్ని దెబ్బతీసేవిధంగాఉన్నాయని,బాధ్యతాయుతమైన ప్రజా పతినిధులె ఇలా మాట్లాడితే ఇది చూసిన సామాన్య ప్రజలు ఎలా మాట్లాడుతారనిఈరసరపు యాదగిరి గౌడ్ డిమాండ్ చేశారు. దళితుల ఆత్మ గౌరవాన్నికించపరిచేవ్యాఖ్యలనుఎట్టిపరిస్థితుల్లోనూ సహించ బోమని స్పష్టం చేశారు. లేనియెడల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దళితులు తిరగబడతారని హెచ్చరించారు,ఈకార్యక్రమంలో గుండాల



మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇమ్మడి దశరథ గుప్తా, జిల్లా కాంగ్రెస్ నాయకులు పోడిశెట్టి వెంకన్న ,చేనేత సహకార సంఘం చైర్మన్ చిందం ప్రకాష్, గుండాల టౌన్ అధ్యక్షులు కొడపర్తి భాస్కర్, యూత్ అధ్యక్షులుమోష ,నాయకులు కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**నార్కట్ పల్లి ,(ప్రజా జ్యోతి);**

నార్కట్ పల్లి మండలంబ్రాహ్మణ వెల్లంల గ్రామానికి చెందిన ఈగల మణెమ్మ (కటిక మణెమ్మ) మంగళవారం ఉదయంఅనారోగ్యంతో మృతి చెందారు.విషయం తెలుసుకున్న నార్కట్ పల్లి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ మండలఅధ్యక్షులు బత్తుల ఉషయ్య గౌడ్ మానవతా దృక్పథంతో రూ. 5000 ఆర్థిక సహాయం పంపగా, ఆ సహాయాన్ని సర్పంచ్ చిరుమర్తి ధర్మయ్య చేతుల మీదుగా మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి, వారికి అండగా ఉంటామని ఊశయ్య భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు బొడిగె నరసింహ, ఉప సర్పంచ్ నల్లబోతు సత్తయ్య, వార్డు మెంబర్లు బొడిగె మౌనిక-స్వామి, సోమనబోయిన మధు, సోమనబోయిన నాగరాజు, గూడూరు ప్రియాంక-కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు చాడ రాజురెడ్డి, బోగారపు సైదులు, విశ్వనాథుల గణేష్, తదితరులు పాల్గొన్నారు.



# భువనగిరిలో డిగ్రీ,పిజి కళాశాలల బంద్ ప్రశాంతం..

## - నో ఆర్టీఎఫ్..నో ఎడ్యుకేషన్ అంటు కళాశాల ల గేటుకు తాళం వేసి యాజమాన్యాల నిరసన

## - తక్షణమే బకాయిలు చెల్లించాలని డిమాండ్- ప్రిన్సిపాల్ చిక్క ప్రభాకర్ గౌడ్

**భువనగిరి,సెప్టెంబర్ 8(ప్రజాజ్యోతి)**

గత నాలుగు సంవత్స రాలుగా,పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని, డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు చేపట్టిన బంద్‌కు భువనగిరి పట్టణంలోని శ్రీ నవభారత్ డిగ్రీ, పీజీ కళాశాల పూర్తి మద్దతు తెలిపింది. బంద్‌లో భాగంగా,మంగళవారం కళాశాలను మూసివేసి ప్రభుత్వ వైఖరికి నిరసిస్తూ వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ చిక్క ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలు గా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో కళాశాలలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.ఒకవైపు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయకపోవడం, మరోవైపు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందకపోవడంతో కళాశాలల నిర్వహణపై ఆర్థిక భారం పెరుగుతోందని తెలిపారు. సపోర్టు కాలేజెస్.. సేవ్ ఎడ్యుకేషన్, నో ఆర్ టిఎఫ్..నో ఎడ్యుకేషన్ అంటూ నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. విద్యా సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం పెండింగ్ బకాయిల విడుదలపై తక్షణ నిర్ణయం తీసుకోవాలని కోరారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ అనేది విద్యార్థుల ఉన్నత విద్య కొనసాగింపులో కీలకమైన అంశమని, ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం బకాయిలను దీర్ఘకాలం



పెండింగ్‌లో ఉంచడం వల్ల విద్యార్థులు, కళాశాలలు రెండూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు.కళాశాలల ఆర్థిక సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించి, పెండింగ్‌లో ఉన్న ఆర్టిఎఫ్ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిల చెల్లింపుల్లో జాప్యం కొనసాగితే విద్యా రంగంపై మరింత ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు."మా డిమాండ్ మా హక్కు" అంటూ కళాశాల అధ్యాపకులు,యాజమాన్యాం తమ డిమాండ్‌ను స్పష్టం చేశాయి. కళాశాలలను కాపాడటం, విద్యను కొనసాగించడం కోసం ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్టీఎఫ్ బకాయిల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో నవభారత్ కళాశాల యాజమాన్యంతో పాటు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# అసెంబ్లీలో మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అవమానించడం దుర్మార్గం

## - మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు- బి ఆర్ ఎస్ నిరసన, ర్యాలీ





**మిర్యాలగూడ, సెప్టెంబర్ 08,(ప్రజాజ్యోతి):**

తెలంగాణ అసెంబ్లీలో బి ఆర్ ఎస్ పార్టీ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డితో పాటు శాసన మండలి సభ్యులనుఅవమానించేలా వ్యవహరించిన తీరును నిరసిస్తూ మిర్యాలగూడ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ఆధ్వర్యంలో పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం పెద్దఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు.స్థానిక పార్టీ కార్యాలయంలో మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సమావేశమై అసెంబ్లీలో జరిగిన ఘటనను తీవ్రంగా ఖండించారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి సాగర్ రోడ్డులోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి, అక్కడ విగ్రహానికి వినతిపత్రంసమర్పించారు.ఈ సందర్భంగా నాయకులుమాట్లాడుతూ, ప్రజల సమస్యలను ప్రస్తావించేందుకు అసెంబ్లీకి వెళ్లిన మహిళాప్రజాప్రతినిధులను అవమానించడం ప్రజాస్వామ్య విలువ లకు విరుద్ధమని అన్నారు. మహిళలను గౌరవిస్తామని చెప్పే కాంగ్రెస్ ప్రభుత్వం, తన చర్యల ద్వారా మహిళా ప్రజాప్రతినిధుల పట్ల తన వైఖరిని బయటపెట్టిందని విమర్శించారు.మహిళా ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలకు జరిగిన అవమానంపై ప్రభుత్వం వెంటనే స్పందించి క్షమాపణ చెప్పాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మహిళలఆత్మగౌరవాన్ని కాపాడే వరకుబి ఆర్ ఎస్ పార్టీ మహిళా విభాగం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తిప్పన విజయసింహారెడ్డి, చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, దుర్గంపూడినారాయణరెడ్డి, ధనావత్ చిట్టిబాబు నాయక్, బైరం సంపత్, ఎడవెల్లి శ్రీనివాసరెడ్డి , అన్నభీమోజు నాగార్జున చారి,పాలుట్ల బాబయ్య, మట్టపల్లి సైదయ్య యాదవ్, నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి, ఎండి ఇలియాస్ ఖాన్ , పెద్ది శ్రీనివాస్ గౌడ్,చౌగని బిక్షం గౌడ్, పెండ్యాల పద్మావతి , ధూళిపాల కళావతి , కుర్ర చైతన్య, సహనాజ్ బేగం, రూక్షాన, పెరుమాళ్ళ ధనమ్మ, చిత్రం ఉమా, కోదాటి రమ, బాణావత్ లలితా , దీపిక, గుడిశ జానకమ్మ, సందేశ్ రజిని, నాయకులు, కార్యకర్తలు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలు అత్యంత హేయం

## - మాల మహానాడు జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు తాళ్లపల్లి రవి

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 08,(ప్రజాజ్యోతి):**

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను మాల మహానాడు జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు తాళ్లపల్లి రవి తీవ్రంగా ఖండించారు.నల్గొండ జిల్లా మిర్యాలగూడలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఒక దళిత బిడ్డ శాసనసభ స్పీకర్‌గా ఉండటాన్ని కొందరు బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని ఆరోపించారు. దళితుల పట్ల ఆ పార్టీకి ఉన్న వివక్షకు తాతా మధు చేసిన వ్యాఖ్యలే నిదర్శనమని అన్నారు.ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు వెంటనే దళిత సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని తాళ్లపల్లి రవి డిమాండ్ చేశారు. స్పీకర్‌పై అగౌరవంగా వ్యాఖ్యలు చేసిన తాతా మధుపై పార్టీ పరంగా కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయనను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేయాలని కోరారు.రాజ్యాంగ పదవిలో ఉన్న దళిత నాయకుడిని అవమానించేలా వ్యాఖ్యలు చేసిన వ్యవహారంపై చట్టపరంగా సమగ్ర విచారణ జరిపి, నేరం రుజువైతే సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఏ రాజకీయ పార్టీ అయినా దళితుల పట్ల అవమానకరంగా వ్యవహరించినా, హుందాతనం లేకుండా వ్యాఖ్యలు చేసినా మాల మహానాడు చూస్తూ ఊరుకోదని తాళ్లపల్లి రవి హెచ్చరించారు. దళితుల ఆత్మగౌరవం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటంకొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్‌వాది, సామాజికవేత్త డాక్టర్ జాడీ రాజు, మాల మహానాడు నల్గొండ జిల్లా అధ్యక్షుడు బొప్పని నాగేష్, తాళ్లపల్లి నరసయ్య, మాల మహానాడు రాష్ట్ర కమిటీ సభ్యుడు చిలుకూరి అభినవ్, తాళ్లపల్లి దేవరాజ్, సామా నగేష్, పట్టణ నాయకులు పేరం దివాకర్, పురిమెట్ల శ్రీనివాస్, పగిడిపల్లి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం..

**నూతనకల్.. సెప్టెంబర్ 08 (ప్రజా జ్యోతి):**

మండల కేంద్రంలో అక్షరాస్యత దినోత్సవం పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం సమీరా హాస్పిటల్ ఆవరణంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నాగం సుధీర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేదని కొనియాడారు వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి వహించి ఉత్తమ బావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని కొని యాడారు సన్మాన గ్రహీతలు ఆలగడప సత్యనారాయణ ఉప్పు నాగయ్య కుర ఆకుల నాగరాజు లను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బయ్యు రవీందర్ కోశాధికారి లయన్ మేడిపల్లి శ్రీనివాస్ పూర్వ అధ్యక్షులు లయన్ బంద్ కృష్ణయ్య, లయన్ షాబాద్ వెంకటరెడ్డి, లయన్ షేక్ నాగుల్ మీరా, లయన్ సాధు రామకృష్ణారెడ్డి లయన్ తీగల శ్రీధర్ రెడ్డి , లయన్ గిలకత్తుల రామస్వామి లయన్ దీకొండ వీరన్న, లయన్ సామ ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# గవర్నర్ చేతుల మీదుగా ఆంజనేయులుకు డాక్టరేట్

**హాలియా, సెప్టెంబర్ 6 (ప్రజా జ్యోతి):**




హాలియా మున్సిపాలిటీకి చెందిన ప్రముఖ విద్యావేత్త,శ్రీ శ్లోక స్కూల్స్ చైర్మన్ కుకడాల ఆంజనేయులు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పిహెచ్డీ పట్టాను అందుకున్నారు. మంగళవారం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన స్నాతకోత్సవంలో తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల చేతుల మీదుగా ఆయన ఈ డాక్టరేట్‌ను స్వీకరించారు. కామర్స్ (వ్యాపార, వాణిజ్య) విభాగంలో ఆయన చేసిన విశిష్ట పరిశోధనకు గాను ఓయూ పరీక్షల విభాగం ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది.అత్యంత వెనుకబడిన బిసి వర్గానికి చెందిన పేద కుటుంబంలో జన్మించిన ఆంజనేయులు, అనేక సామాజిక,ఆర్థిక అడ్డంకులను అధిగమించి తన విద్యాభ్యాసాన్ని కొనసాగించారు.చదువుపై ఉన్న అపారమైన ఆసక్తి,పట్టుదల, నిరంతర శ్రమతో ఉన్నత చదువులు పూర్తి చేశారు. సమాజానికి నాణ్యమైన విద్యాసేవలు అందించాలనే లక్ష్యంతో శ్రీ శ్లోక పాఠశాలలను స్థాపించి,విజయవంతంగా నిర్వహిస్తున్నారు.సామాన్య స్థాయి నుంచి ప్రారంభమై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో డాక్టరేట్ సాధించే స్థాయికి ఎదిగిన ఆంజనేయులు జీవన ప్రయాణం నేటి యువతకు ఎంతో ఆదర్శదాయకమని విద్యావేత్తలు కొనియాడారు.ఈ సందర్భంగా భారత్ బయోటెక్ చైర్మన్ డాక్టర్ కృష్ణ ఎల్లా, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ ములుగురామ్ ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. డాక్టరేట్ సాధించిన ఆంజనేయులుకు కుటుంబ సభ్యులు,మిత్రులు, విద్యావేత్తలు,శ్రేయోభిలాషులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

# మంగళ గౌరీ వ్రతాలతో వెల్లివిరిసిన భక్తి



**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి):**





శ్రావణ మాసపు చివరి మంగళవారం సందర్భంగా భూదాన్ పోచంపల్లి పట్టణం లోని మార్కండేయ స్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళ గౌరీ వ్రతాల కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం మహిళా భక్తులతో సందడిగా మారింది.మహిళలు సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాల్లో పాల్గొని మంగళ గౌరీ దేవిని భక్తిశ్రద్ధలతో ఆరాధించారు. తమ దాంపత్య జీవితం సుఖసంతోషాలతో కొనసాగాలని, కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ మంగళ గౌరీ నోమును ఆచరించారు. పూజా కార్యక్రమాల అనంతరం ముత్తైదువులు పరస్పరం వాయినాలు అందించుకుని మంగళ గౌరీ వ్రతాన్ని భక్తితో ముగించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ శ్రావణ మాసంలో మంగళ గౌరీ వ్రతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, మహిళలు తమ కుటుంబాల శ్రేయస్సు, దాంపత్య సౌభాగ్యం కోసం ఈ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారని తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సీత సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు భారత ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి అంకం యాదగిరి, సహాయ కార్యదర్శి గుర్రం కృష్ణ, కోశాధికారి యాదగిరి, ధర్మకర్త పుట్టపర్తి శిరీషతో పాటు కమిటీ సభ్యులు, మహిళా భక్తులు, ముత్తైదువులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల హక్కులకు.. ఛలో హైదరాబాద్

## - భువనగిరి జిల్లా నుంచి 10 వేల మంది తరలింపు- జేఏసీ కన్వీనర్ భగత్

## - పోచంపల్లిలో సభ పోస్టర్ ఆవిష్కరణ

**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి):**

ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈనెల 10న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్‌హక్కుల సాధన సభ' కు యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి 10 వేల మందికి పైగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తరలివెళ్లనున్నట్లు జిల్లా ఉద్యోగుల జేఏసీ కన్వీనర్ ధరణికోట భగత్ తెలిపారు.బుధవారం భూదాన్ పోచంపల్లిలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో సభ పోస్టర్‌ను జేఏసీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భగత్ మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలన్నీ న్యాయమైన డిమాండ్లేనని, పరిష్కరిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి మూడేళ్లు గడుస్తున్నా నివేదిక తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల కోసం జారీ చేసిన ఈహెచ్‌ఎస్ జీవో అమలు కావడం లేదని, ప్రైవేట్ ఆస్పత్రులు సైతం ఈహెచ్‌ఎస్‌ను అంగీకరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.సభకు లక్ష మందికిపైగా ఉద్యోగులు హాజరయ్యేలా రాష్ట్రవ్యాప్తంగా కార్యాచరణ చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ నాయకులు ఆపాల సత్యనారాయణరెడ్డి, తహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో విజయ, ఎంఈవో ప్రభాకర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు యాదయ్య, రమేష్, రాములు, లింగయ్య, పంచాయతీరాజ్ శాఖ శ్రీకాంత్‌రెడ్డి, శశికాంత్‌గౌడ్, జిల్లా నాయకులు ఖదీర్, శ్రీకాంత్, డిప్యూటీ తహశీల్దార్ నాగేశ్వర్‌రావు, పెన్షనర్ సంఘం నాయకులు బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# దొంగతనం కేసులో నిందితుడికి 2 సంవత్సరాల జైలు శిక్ష...

## - రూ.500 జరిమానా..- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

**నల్లగొండ సెప్టెంబర్ 8,(ప్రజా జ్యోతి):**



నల్లగొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన దొంగతనం కేసులో నిందితుడికి 2 సంవత్సరాల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ గౌరవనీయ మూడు వ అదనపు జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు, నల్లగొండ న్యాయమూర్తి గారు తీర్పు వెలువరించారని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు.కేసు వివరాల ప్రకారం.. నల్లగొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నూతన గృహ నిర్మాణ దశలో ఉన్న ఇళ్లలో విద్యుత్ వైర్లు, ఇతర సామాగ్రిని దొంగతనం చేసిన ఘటనపై నేర సంఖ్య 58/2026, సెక్షన్ 305(ఏ) భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) కింద కేసు నమోదు చేశారు.ఈ కేసులో గుంటి సుని, తండ్రి యాకోబు, వయస్సు 30 సంవత్సరాలు, వృత్తి ఎలక్ట్రీషియన్, పిడుగురాళ్ల, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిని నిందితుడిగా గుర్తించారు. ఈ కేసుకు సంబంధించి సీసీ నం.621/2026గా కోర్టులో విచారణ కొనసాగింది.ఈ కేసును నల్లగొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ వై. సైదులు దర్యాప్తు చేసి, నిందితుడిపై తగిన ఆధారాలతో అభియోగ పత్రాన్ని కోర్టులో సమర్పించారు.కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడికి 2 సంవత్సరాల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ గౌరవనీయ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 15 రోజుల సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది.నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి, కోర్టులో కేసు పటిష్టంగా నిలిచే విధంగా కృషి చేసిన దర్యాప్తు అధికారి వై. సైదులు, ఏపీపీ ఎన్. కృష్ణయ్య, డీసీఆర్బీ సీఐ శ్రీను నాయక్, కోర్టు డ్యూటీ అధికారి పి. వెంకటేష్, లైజన్ అధికారులు హెచ్.పి. నరేందర్, పీసీ ఎన్. మల్లికార్జున్ మరియు సంబంధిత పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యేకంగా అభినందించారు.

# లైసెన్స్‌డ్ సర్వేయర్ల ముందస్తు అరెస్ట్

## - శాంతియుత నిరసనను అడ్డుకోవడం దారుణం

**చండూరు,సెప్టెంబర్ 8(ప్రజా జ్యోతి):**

రాష్ట్ర వ్యాప్తంగా తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం లైసెన్స్డ్ సర్వేయర్లు చేపట్టిన అసెంబ్లీ ముట్టడి పిలుపు ఉద్రిక్తతకు దారితీసింది. మంగళవారం చండూరు మండలానికి చెందిన పలువురు లైసెన్స్డ్ సర్వేయర్లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా లైసెన్స్డ్ సర్వేయర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భూతరాజు మురళీ మాట్లాడుతూ.. ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలపై శాంతియుత నిరసన తెలపడానికి వెళ్తుంటే అక్రమంగా అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాయడం ప్రభుత్వ హేయమైన చర్య అని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సర్వేయర్ల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అరెస్టయిన వారిలో సర్వేయర్లు కొమ్ము గణేష్, గుడిసె విజయ్, పులకరం కళ్యాణ్ తదితరులు ఉన్నారు.




# కనగల్ ఎంపీడీవోకు ఫిర్యాదు పత్రం

## - గ్రామపంచాయతీ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి...

## - 30 రోజుల గడువులోగా సమాచారం అందించని కారణంగా, సెక్షన్ 7(6) ప్రకారం పూర్తి ధ్రువీకృత ప్రతులను ఉచితంగా అందించాలి..

## - సమాచార హక్కు చట్టం ప్రకారం పూర్తి ధ్రువీకృత ప్రతులను ఉచితంగా అందించాలి..



**కనగల్ సెప్టెంబర్ 8,(ప్రజాజ్యోతి):**

సమాచార హక్కు చట్టం నిబంధనలను సక్రమంగా అమలు చేయకుండా, రికార్డుల తనిఖీకి తేదీలు ఇచ్చి విధులకు గైర్హాజరవుతున్న గ్రామపంచాయతీ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు వికాస సమితి జిల్లా అధ్యక్షులు బైరు సైదులు గౌడ్ డిమాండ్ చేశారు.ఈ మేరకు కనగల్ మండల ఎంపీడీవో వేద రక్షితకు సమాచార హక్కు వికాస సమితి జిల్లా అధ్యక్షులు బైరు సైదులు గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు తుంగతుర్తి రామకృష్ణ ఫిర్యాదు పత్రం సమర్పించారు. మండలంలోని వివిధ గ్రామపంచాయతీలకు సమాచార హక్కు చట్టం ప్రకారం దరఖాస్తులు సమర్పించి రికార్డుల తనిఖీకి అనుమతి కోరగా, కొందరు కార్యదర్శులు సెక్షన్ 2(జె) ప్రకారం తేదీలు కేటాయించి ఆ రోజుల్లో విధులకు హాజరు కావడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొందరు సెలవు దినాల్లో సైతం తనిఖీ తేదీలు ఇచ్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.అలాగే నిర్ణీత 30 రోజుల గడువులోగా సమాచారం అందించని కారణంగా, సెక్షన్ 7(6) ప్రకారం కోరిన పూర్తి ధ్రువీకృత ప్రతులను ఉచితంగా అందించాలని ఎంపీడీవోను కోరారు. ఈ విధంగా విధులకు గైర్హాజరవుతూ సమాచార హక్కు చట్టం అమలులో నిర్లక్ష్యం చేస్తున్న గ్రామపంచాయతీ కార్యదర్శులపై విచారణ జరిపి తగిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న సమాచార హక్కు దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని బైరు సైదులు గౌడ్ డిమాండ్ చేశారు.

# స్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలి

**చింతలపాలెం, సెప్టెంబర్ 8 (ప్రజా జ్యోతి) :**




గ్రామంలోని శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ స్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఒక సామాజిక వర్గానికి చెందిన స్మశాన వాటికతో గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గంజి హనుమంతరావు అన్నారు. స్మశాన వాటిక చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడంతో సమాధులు బహిరంగంగా కనిపిస్తున్నాయని తెలిపారు. అదేవిధంగా స్మశాన వాటికలో సరైన పారిశుధ్య నిర్వహణ లేకపోవడంతో పిచ్చి మొక్కలు, అపరిశుభ్రత పేరుకుపోయి పరిసర ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన రహదారి పక్కనే, గ్రామ నడిబొడ్డున స్మశాన వాటిక ఉండటంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. స్మశాన వాటిక చుట్టూ నివాస గృహాలు ఉండటంతో అక్కడి ప్రజలు కూడా అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. స్మశాన వాటికకు ఎదురుగా శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ అంకమ్మ దేవాలయం ఉండటంతో ఆలయానికి వచ్చే భక్తులు, మహిళలు, చిన్నారులు సైతం సమాధులు బహిరంగంగా కనిపించడం వల్ల ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యపై గతంలో గ్రామ కార్యదర్శి, సర్పంచ్‌ను కలిసి వివరించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. దీంతో మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో కు వినతిపత్రం అందజేశారు. స్మశాన వాటికను అధికారులు పరిశీలించి, ప్రహరీ గోడ నిర్మాణంతో పాటు పారిశుధ్య చర్యలు చేపట్టి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు.

# క్రీడా వసతులు కల్పించాలి



**చింతలపాలెం, సెప్టెంబర్ 8 (ప్రజా జ్యోతి) :** యువతకు ఉపయోగపడేలా క్రికెట్ మైదానం, ఇండోర్ స్టేడియం తదితర క్రీడా సదుపాయాలను ఏర్పాటు చేయాలని మెట్టు వెంకటరామిరెడ్డి కోరారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న దొండపాడు ఎస్సీ కాలనీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉద్దోజు శ్రీనివాసాచారిని మంగళవారం పాఠశాలలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి, వారి బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. శ్రీనివాసాచారికి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించడం అభినందనీయమన్నారు. అనంతరం గ్రామంలో క్రీడా సదుపాయాల గురించి మాట్లాడుతూ యువత శారీరక, మానసిక వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని అన్నారు. గ్రామంలో క్రీడా వసతులు అందుబాటులో ఉంటే యువతను చెడు అలవాట్లకు దూరంగా ఉంచడంతో పాటు క్రీడలపై ఆసక్తిని పెంపొందించవచ్చని తెలిపారు. క్రికెట్ మైదానం, ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేస్తే యువతతో పాటు చిన్నారులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో సాలె నాగరాజు, భవిత కేంద్రం ఉపాధ్యాయులు నరసింహారావు, రాజేష్, యామిని, సుజాత, బడుగుల శ్రీనివాస్ యాదవ్, దొంగల కార్తిక్ యాదవ్ (చింతలపాలెం మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్), దేరంగుల భాగ్యరాజు, మెట్టు చంద్రారెడ్డి, దొంగల శ్రీకాంత్ యాదవ్, గడ్డం హుస్సేన్, ఉప్పు శివ, దేరంగుల భరత్ తదితరులు పాల్గొన్నారు..

## దళిత స్పీకర్‌ను అవమానించిన తాతా మధుపై

# చర్యలు తీసుకోవాలి

### - కాంగ్రెస్ కంటెస్టెడ్ సర్పంచ్ అశోక్ గంటేకంపు డిమాండ్

**చండూరు, సెప్టెంబర్ 8(ప్రజా జ్యోతి)** ప్రజా పాలనలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం దళిత సామాజిక వర్గానికి చెందిన గడ్డం ప్రసాద్ కుమార్‌ను తెలంగాణ శాసనసభ స్పీకర్‌గా నియమించడాన్ని కొందరు ఓర్వలేకపోతున్నారని కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ సర్పంచ్ అశోక్ గంటేకంపు ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళితులకు తగిన ప్రాధాన్యత కల్పించలేదని విమర్శించారు. దళితులకు ఇచ్చిన హామీల విషయంలో కేసీఆర్ మోసం చేశారని ఆరోపించారు. తన తొమ్మిదేళ్ల పాలనలో దళితులకు సరైన మంత్రి పదవులు ఇవ్వలేదని, ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన తాటికొండ రాజయ్యను అర్ధాంతరంగా పదవి నుంచి తొలగించారని పేర్కొన్నారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం దళితుడిని శాసనసభ స్పీకర్‌గా నియమించిందని, దళితులకు గౌరవం, ప్రాధాన్యత కల్పిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేయడం సరికాదన్నారు.ఇటీవల శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు ఆరోపణలు వస్తున్న అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు అశోక్ గంటేకంపు తెలిపారు. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న స్పీకర్‌ను అవహేళన చేసే విధంగా మాట్లాడిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి బహిష్కరించే అంశంపై ప్రభుత్వం త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను సహించేది లేదని హెచ్చరించారు.దళితులు ఐక్యంగా తమ హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడాల్సిన అవసరం ఉందని అశోక్ గంటేకంపు పిలుపునిచ్చారు.



# కుమ్మరి సంఘం అధ్యక్ష కార్యదర్శుల ఎన్నిక

**నూతనకల్..సెప్టెంబర్ 08 (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం మండల అధ్యక్షునిగా మండల కేంద్రానికి చెందిన బొడ్డుపల్లి గణేష్, ప్రధాన కార్యదర్శిగా మిరియాల గ్రామానికి చెందిన చలిగంటి శ్రీనివాస్ ను ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో నియోజకవర్గ ఇన్చార్జ్ కోటమర్తి శ్రీనివాస్ అధ్యక్షతన జిల్లా కన్వీనర్ చలిగంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఆ సంగం మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ.. గ్రామ దేవతల వద్ద కుమ్మరులను పూజారులుగా జీవో విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. తన ఎన్నికలకు సహకరించిన కుమ్మరి సంఘ నాయకులకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.. కుమ్మరి సంఘం అభివృద్ధి చెందే విధంగా తన వంతు కృషి చేస్తానని అన్నారు.. ఈ కార్యక్రమంలో సత్యం, వెంకటనర్సు, రాచకొండ చంద్రయ్య, ఏనుగతల సోమయ్య, బొడ్డుపెల్లి అంజయ్య, దరిపెల్లి వీరన్న, ఏనుగతల రవి, బొడ్డుపల్లి సతీష్, ఉదయ్, పరశు రాములు, రామచంద్రయ్య, శ్రీధర్, శ్రీను, మల్లయ్య తదితరున్నారు..



# ఆరుగురు పేకాటారాయుళ్ల అరెస్టు, 38 వేల నగదు, 5 బైకు లు స్వాదీనం

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 08,(ప్రజాజ్యోతి):** మిర్యాలగూడ పట్టణంలో టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ని ఎన్ ఎస్ పి క్యాంప్ లో మంగళవారం ఓ ఇంటిలో గుట్టుగా బెట్టింగ్ పెట్టి పేకాట ఆడుతున్న ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి, 38 వేల రూపాయల నగదు, 5 బైకులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జేట్టి సోమ నరసయ్య తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి, చేపట్టినట్లు తెలిపారు. పట్టణంలో ఎవరైనా అక్రమంగా పేట పేకాట స్థావరాలు నిర్వహించిన, ఆడినా చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

# చేదెక్కిన చక్కెర, బెల్లం..!

## - ఆదాయం అడుగులో... ధరలు ఆకాశంలో...

## - వంటింట్లో ధరల మంట... సామాన్యుడికి కడుపులో మంట

## - ఎల్నినో తెచ్చిన ధరల భారం..- సామాన్య, మధ్యతరగతి ప్రజల్లో ఆందోళన..

**నల్లగొండ సెప్టెంబర్ 8,(ప్రజా జ్యోతి ):**

నిత్యవసర వస్తువైనా చక్కెర ధర పెరగడంతో సామాన్య,మధ్య తరగతి ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చక్కెర ఒక కిలో హోల్సేల్ గా 75 రూపాయలు రిటైల్ గా 80 రూపాయలు ఉన్నది...చక్కెర, బెల్లం ఒక్కసారిగా రెట్టింపు కావడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తల్లడిల్లిపోతున్నారు.గ డిచిన 20 రోజుల్లోనే తీపి పదార్థాల ధరలు అమాంతం పెరిగాయి.20 రోజుల క్రితం కిలో 5.40 ఉన్న చక్కెర నేడు కిలో 5.80 8 చేరింది.అలాగే బెల్లం కిలో రూ.60 నుండి 5.80 పెరిగింది.ప్రస్తుతం శ్రావణమాసం, వ్రతాలు, బోనా ధరలు లు, వివాహాది శుభకార్యాలు ఎక్కువగా ఉండటం చేత చక్కెర బెల్లం వాడకం భారీగా పెరిగింది. ఉత్పత్తి తగ్గడం వల్లే ధరలు పెరిగాయని వ్యాపారస్తులు చెబుతున్నారు కానీ,వ్యాపారులు సృష్టిస్తున్న కృత్రిమ కొరతేనని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డిమాండ్ ఉన్న సమయంలో అక్రమంగా నిల్వచేసి, సామాన్యులకు అందుబాటులో లేకుండా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.నెల రోజుల కింద ఉల్లి కిలో రూ.30 ఉండగా నేడు కిలో రూ.60 కి చేరింది.దీంతో హోటల్లు టిఫిన్ సెంటర్లలో నిర్వాహకులు ఉల్లితో తయారైన వంటకాలపై ధరలు పెంచి ఆభారం వినియోగదారులపై మోపుతున్నారు.వంట

### - నూనెల ధరలు సలసల కాగుతున్నాయి--

మార్కెట్లో 25 కిలోల బియ్యం బస్తా ధర రూ.1300 నుండి రూ.1700 కు చేరింది. అసలే శ్రావణమాసం వరుసగా పండుగల సీజన్, పిండివంటలు చేయాలి కానీ మార్కెట్లో లో నిత్యావసర వస్తువుల ధరలు చూస్తుంటే సామాన్యులు ఏం కొనేటట్లు లేదు.ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో అన్నింటా ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ధరల నియంత్రణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలి. అక్రమ నిల్వలు, కృత్రిమ అరికట్టడం వినియోగదారుడికి కొరతను ద్వారా అందుబాటు ధరలో వస్తువులు లభిస్తాయని పలువురి అభిప్రాయం.ధరల నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సామాన్య ప్రజల విన్నపం..

### నెలవారీ బడ్జెట్ భారమవుతుంది..

**శ్రీరామోజు కనకాచారి,రవీంద్ర నగర్ నల్లగొండ, ప్రయివేట్ ఉద్యోగి..**





అద్దె, పిల్లల చదువులు, విద్యుత్ బిల్లులు, వైద్యం ఇలా ఎన్నో ఖర్చులు.వాటికితోడు నిత్యావసరాల ధరలు పెరగడంతో మధ్య తరగతి కుటుంబాల నెలవారీ బడ్జెట్ మరింత ఇబ్బందులకు గురవుతున్నాం. భారమవుతోంది. నెలరోజుల కింద ఉన్న ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ముఖ్యంగా బియ్యం, నూనె, ఉల్లి, పంచదార సహా పలు నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కుటుంబ బడ్జెట్పై అదనపు భారం పడుతోంది. మా ఇంట్లో నలుగురు సభ్యులుంటారు. నెలవారీగా బియ్యం, నిత్యావసరాలకు రూ.5000 ఖర్చు అవుతుండగా తాజాగా సరకులు, బియ్యం తెస్తే రూ.7500 ఖర్చు అయ్యింది. ఒక్కసారిగా రూ.2500 అదనపు భారం పడింది. జీతం పెరగలేదు. ఖర్చులు పెరగడంతో సామాన్యులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

# చండూరు మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులకు జూట్ బ్యాగులు, నిత్యావసరాల పంపిణీ

**చండూరు, సెప్టెంబర్ 8( ప్రజా జ్యోతి):**

చండూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మంగళవారం రోజు సాయంత్రం 4.30 గంటలకు చండూరు మున్సిపాలిటీ కార్యాలయ ప్రాంగణంలో పారిశుధ్య సిబ్బందికి సబ్బులు, బెల్లం, కొబ్బరి నూనె ప్లాస్టిక్ కవర్లకు బదులుగా పర్యావరణహితమైన జూట్ బ్యాగుల్లో పంపిణీ చేయడం జరిగింది.మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ, పారిశుధ్య సిబ్బంది సేవలు సమాజానికి ఎంతో విలువైనవని, వారి శ్రమ వల్లనే ప్రజలు ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవిస్తున్నారని పేర్కొన్నారు. వారి సేవలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. పారిశుధ్య కార్మికులు మున్సిపాలిటీ అభివృద్ధిలో అంతర్భాగమని, వారి సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని తెలిపారు. భవిష్యత్తులో కూడా పారిశుధ్య సిబ్బందికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. మరియు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా పునర్వినియోగించగల జూట్ బ్యాగులను వినియోగించాలని సూచించారు.మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికులు ప్రతిరోజూ ఎండ, వాన, చలి వంటి ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందిస్తున్నారని అన్నారు. వారి ఆరోగ్యం, భద్రత మరియు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ఇటువంటి సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. పట్టణ ప్రజలు "ప్లాస్టిక్‌కు బదులు పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా" ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు కూడా ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించి జూట్, క్లాత్ బ్యాగులను ఉపయోగించాలని కోరారు.ఇట్టి కార్యక్రమములో కౌన్సిలర్ సభ్యులు కొన్రెడ్డి మధు, కటకం రమేష్, కో-ఆప్షన్ సభ్యులు కల్లెట్ల చంద్రకళమారయ్య, మొగుదాల సత్తమ్మవెంకన్న, షేక్ ఖలీల్ , మేనేజర్ జి . రాములు వార్డ్ ఆఫీసర్స్ జి. శ్రీరాములు, ఎ. జగన్, బి. సాయిరాం, ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ యమ్. అరవింద్ రెడ్డి, బిల్ కలెక్టర్స్ , పారిశుధ్య కార్మికులు పాల్గొనడం జరిగింది.



# ఓటర్లకు ధ్రువపత్రాలపై ముందస్తు అవగాహన కల్పించాలి

## - హియరింగ్‌కు ముందే అవసరమైన పత్రాల వివరాలు తెలియజేయాలి..

## - బీఎల్ఓలు, బీఎల్ఏలు ఇల్లిల్లూ తిరిగి నోటీసులు అందజేయాలి....ఎన్నికల ఓటరు జాబితా పరిశీలకురాలు, రాష్ట్ర ఉన్నత విద్య కమిషనర్ ఏ. శ్రీదేవసేన.

**నల్గొండ సెప్టెంబర్ 8,(ప్రజా జ్యోతి):**

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లకు హియరింగ్‌కు ముందే సమర్పించాల్సిన ధ్రువపత్రాల వివరాలను తెలియజేయాలని నల్గొండ జిల్లా ఎన్నికల ఓటరు జాబితా పరిశీలకురాలు, రాష్ట్ర ఉన్నత విద్య కమిషనర్ ఏ. శ్రీదేవసేన సూచించారు. ముందుగానే సమాచారం అందిస్తే హియరింగ్ ప్రక్రియ సులభంగా పూర్తవుతుందని తెలిపారు.మంగళవారం కేతేపల్లి మండలం కొర్లపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన 287, 288 పోలింగ్ కేంద్రాలను ఆమె తనిఖీ చేసి ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించారు. బీఎల్ఓలు, బీఎల్ఏలతో మాట్లాడుతూ ఓటర్ల సంఖ్య, మ్యాపింగ్ కాని ఓటర్లు, నోటీసులు, హియరింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.నోటీసులు ఎందుకు జారీ చేశారో, వాటికి సమర్పించాల్సిన ధ్రువపత్రాలేమిటో ఓటర్లకు ముందుగానే తెలియజేయాలని అన్నారు. బీఎల్ఓలు, బీఎల్ఏలు స్థానిక సర్పంచ్‌లతో సమన్వయం చేసుకుంటూ ఇల్లిల్లూ తిరిగి నోటీసులు అందజేసి అవగాహన కల్పించాలని సూచించారు. నోటీసులు జనరేట్ అయిన ప్రతి ఓటరుకు తప్పనిసరిగా అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఈఆర్ఓ ఎస్‌డీసీ రమాదేవి, తహసీల్దార్ రమాదేవి, సర్పంచ్ కే. సైదిరెడ్డి, బీఎల్ఓలు, బీఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.





# 1104 సంఘంతోనే విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం..

## - రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. సాయిబాబు- ఉద్యోగులు, ఆర్టిజన్లు, కాంట్రాక్టు కార్మికులు ఐక్యంగా పోరాడాలి..

## - యాజమాన్యాలు స్పందించకపోతే ఉద్యమాలకు ముందుండి నాయకత్వం వహిస్తాం..

## - సమస్యల పరిష్కారానికి ఉద్యోగులు ఐక్యంగా ముందుకు సాగాలి..

## - నల్గొండలో ఉద్యోగ విరమణ చేసిన సాయిబాబుకు ఘన సన్మానం..

## - అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన వెంకటయ్యకు ఘన అభినందనలు..

**నల్గొండ, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి):**

తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి 1104 సంఘం నిరంతరం పోరాడుతోందని, ఉద్యోగులు, ఆర్టిజన్లు, కాంట్రాక్టు కార్మికులు ఐక్యంగా ముందుకు సాగితేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. సాయిబాబు అన్నారు. తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల 1104 సంఘం నల్గొండ ప్రాంతీయ కార్యవర్గం ఆధ్వర్యంలో రత్నా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సన్మాన, అభినందన కార్యక్రమంలో ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన జి. సాయిబాబును, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన జిల్లా కార్యదర్శి నిమ్మచెట్ల వెంకటయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ.. విద్యుత్ రంగ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా 1104 సంఘం కీలకంగా పోరాడుతోందన్నారు. వేతన సవరణ కమిటీ నియామకం, యాదాద్రి విద్యుత్ కేంద్రంలోని కొన్ని ప్లాంట్ల ప్రైవేటీకరణ ఉపసంహరణ, ఆర్టిజన్ కార్మికులకు సేవా నియమావళి, ఖాళీ పోస్టుల భర్తీ తదితర 14 ప్రధాన డిమాండ్లపై యాజమాన్యాలతో చర్చలు జరిపినట్లు తెలిపారు. గడువులోగా సానుకూల నిర్ణయాలు తీసుకోకపోతే సంయుక్త కార్యాచరణ కమిటీ ఉద్యమాలకు 1104 సంఘం ముందుండి నాయకత్వం వహిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నల్గొండ వలయ ప్రధాన ఇంజనీర్ ఎ. శ్రీనివాసులు, రాష్ట్ర అధ్యక్షుడు వి. వెంకటేశ్వర్లు, సలహాదారు ఆర్. జనార్ధన్ రెడ్డి, విభాగ ఇంజనీర్లు గణేష్, బాల్య, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అధ్యక్షుడు ఎ. వేణు, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్. వెంకన్న, ప్రాంతీయ అధ్యక్షుడు జైపాల్ రెడ్డితో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు, విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్, కాంట్రాక్టు కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.







# బీఆర్ఎస్‌కు దళితులపై ప్రేమ లేదు

## - హామీలను విస్మరించిన చరిత్ర ఆ పార్టీది- స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

## - సూర్యాపేట డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 08(ప్రజా జ్యోతి):**





బీఆర్ఎస్ పార్టీకి దళితుల పట్ల ఎప్పుడూ చిన్నచూపేనని సూర్యాపేట డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య విమర్శించారు.మంగళవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని గతంలో కేసీఆర్ హామీ ఇచ్చారని,అయితే ఆ హామీని పక్కనపెట్టి తానే ముఖ్యమంత్రి అయ్యారని నర్సయ్య విమర్శించారు.దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చలేదని,దళితబంధు పథకంలోనూ అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి హామీ మేరకు రూ.10 లక్షల సాయం అందలేదని ఆరోపించారు.దళిత సామాజిక వర్గానికి చెందిన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్పై బీఆర్ఎస్ నేతలు చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికావని అన్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక పదవిలో ఉన్న వ్యక్తిపై వ్యక్తిగత,కులపరమైన వ్యాఖ్యలు చేయడం తగదని పేర్కొన్నారు.దళితుడైన తనను డీసీసీ అధ్యక్షుడిగా నియమించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని నర్సయ్య అన్నారు. కులమతాలకు అతీతంగా అర్హులైన అన్ని వర్గాల ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని తెలిపారు.ఉమ్మడి నల్గొండ జిల్లాకు గోదావరి జలాలను తీసుకువచ్చిన ఘనత దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డికే దక్కుతుందని అన్నారు.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలు,ప్రభుత్వ విధానాలపై అన్ని అంశాలను చర్చించాలని సూచించారు.ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వెలుగు వెంకన్న,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, చివ్వెంల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వీరన్న నాయక్,సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం,కౌన్సిలర్లు,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ బంగారు మైసమ్మ ఆలయంలో ఘనంగా ప్రతిష్టాపన మహోత్సవాలు

## - వైభవంగా సాగిన అమ్మవారి ఊరేగింపు, అభిషేకాలు

## - ఆలయ ఆవరణలో శాస్త్రోక్తంగా కుల పెద్దల ప్రత్యేక పూజలు

## - ఆధ్యాత్మిక శోభతో మార్మోగిన ప్రాంగణం.. భారీగా తరలివచ్చిన భక్తులు

**చౌటుప్పల్ సెప్టెంబర్ 8 (ప్రజా జ్యోతి):**







చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారంలో నూతనంగా నిర్మించిన శ్రీ బంగారు మైసమ్మ ఆలయ ప్రాంగణంలో శ్రీ బంగారు విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా, నేత్రపర్వంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల తొలిరోజు సందర్భంగా ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో వెల్లివిరిశాయి. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణంలో మంగళవాయిద్యాల నడుమ ప్రత్యేక ధార్మిక క్రతువులు ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా అర్చకులు శ్రీనివాస్ శర్మ, మాధవుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణల నడుమ అమ్మవారిని భక్తిప్రపత్తులతో ఊరేగింపుగా ఆలయ ప్రాంగణానికి తీసుకొచ్చారు. మహిళల మంగళహారతులు, భక్తుల జయజయధ్వానాల నడుమ ఊరేగింపు కోలాహలంగా సాగింది. అనంతరం ప్రతిష్టించనున్న విగ్రహాలకు అర్చకుల పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా జలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించి విశేష పూజలు జరిపించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కాంక్షిస్తూ కుల పెద్దలు ఆలయ ఆవరణలో సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ మహోత్సవంలో ఆలయ నిర్మాణదాత, ఆది మహావిష్ణు దేవాలయ కమిటీ చైర్మన్ వరకాంతం జంగారెడ్డి, కమిటీ సభ్యులు కుల పెద్దలతో కలిసి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు ఆచరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, వార్డు మెంబర్లతో పాటు గ్రామ ప్రముఖులు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

# ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలి

## - భూసేకరణ పూర్తయిన ప్రాంతాల్లో అవార్డులు త్వరగా పాస్ చేయాలి..- నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్రయోజనాలు సత్వరమే అందించాలి... అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్

**నల్లగొండ సెప్టెంబర్ 8,(ప్రజా జ్యోతి):**

ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను వేగవంతం చేసి, ప్రాజెక్టుల నిర్మాణాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భూసేకరణ పురోగతిపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు భూములు ఇచ్చిన రైతులకు చేసిన పరిహారం చెల్లింపులు, పాస్ చేసిన అవార్డులు, పెండింగ్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ పూర్తయిన ప్రాంతాల్లో అవార్డులను త్వరితగతిన పాస్ చేసి ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని సూచించారు. భూసేకరణ, పరిహారం చెల్లింపులు, నిర్మాణ పనుల మధ్య సమన్వయం పెంచి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ కింద అందించాల్సిన సౌకర్యాలు, ప్రయోజనాలను సత్వరమే కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్ థియాన్ మావి, ఏఎంఆర్పీ భూసేకరణ స్పెషల్ కలెక్టర్ డి. మాధురి, ఇంజనీర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ఈవీఎం గోదాం వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు..





## - రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఈవీఎం గోదాంను పరిశీలించిన.. కలెక్టర్ బి. చంద్రశేఖర్.

**నల్గొండ, సెప్టెంబర్ 8, (ప్రజాజ్యోతి):**

జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన ఎన్నికల గోదామును జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి మంగళవారం పరిశీలించారు.వివిధ రాజకీయ పార్టీల తరఫున హాజరైన ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదామును తెరిపించి, గోదాంలో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు), వివి ప్యాట్లను వారికి చూపించారు. ఈ సందర్భంగా ఈవీఎం గోదాం వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లు, ఇతర అంశాలపై జిల్లా కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్దేశించిన సమయాల్లో జిల్లా కలెక్టర్లు రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఈవీఎం గోదాములను పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగానే మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదామును పరిశీలించినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎం.డి. ముంతాజ్ అలీ, బీజేపీ నుంచి పి. లింగస్వామి, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి అద్దంకి రవి, బీఎస్పీ నుంచి ఆర్. రవిశంకర్, టీఆర్ఎస్ నుంచి పిచ్చయ్య, సీపీఐ(ఎం) నుంచి సైదులు, టీడీపీ నుంచి తేలు అన్న రవి, ఏఐఎంఐఎం నుంచి కాజా గౌస్ మోహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శక ఓటరు జాబితా రూపకల్పనే లక్ష్యం..

## - అర్హులైన ప్రతి ఓటరుకు చోటు కల్పించాలి.. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఏ. శ్రీదేవసేన

## - రెండు చోట్ల ఓటు ఉంటే ఒక చోటే ఉండేలా చర్యలు..




**నల్గొండ, సెప్టెంబర్ 8:(ప్రజా జ్యోతి ):**



పారదర్శకమైన, తప్పులులేని ఓటరు జాబితా రూపొందించడమే ఎన్నికల సంఘం లక్ష్యమని నల్గొండ జిల్లా ఓటరు జాబితా పరిశీలకురాలు, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఏ. శ్రీదేవసేన అన్నారు. అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండాలని, అనర్హుల పేర్లు తొలగించాలని సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సమావేశంలో ఆమె మాట్లాడారు.. నోటీసులు అందుకున్న ఓటర్లకు అవసరమైన ధ్రువపత్రాలపై క్షేత్రస్థాయి సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు కలిసి అవగాహన కల్పించాలని సూచించారు. మ్యాపింగ్ కాని ఓటర్లు, చిరునామా, వయస్సు తదితర వివరాల్లో తేడాలు ఉన్న వారి సమస్యలను జాగ్రత్తగా పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే నోటీసులు అందుకున్న వారికి మరోసారి అవగాహన కల్పించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.




**తప్పులులేని జాబితాకు సమన్వయం అవసరం:**

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. జిల్లాలో 1,861 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 15,16,253 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇప్పటివరకు 13,16,860 మంది ఓటర్ల వివరాల అనుసంధానం పూర్తయిందన్నారు. వివరాల్లో తేడాలు ఉన్న 2,28,939 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి తప్పులులేని ఓటరు జాబితా రూపొందించేందుకు సహకరించాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు జే. శ్రీనివాస్, ప్రేమ్ కరణ్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్ థియాన్ మావి, అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



# తిర్మలాపురం గ్రామంలో ఘనంగా బోనాల సందడి

**చింతపల్లి సెప్టెంబర్ 08(ప్రజాజ్యోతి)**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పల్లెలో ఆషాఢ,శ్రావణ మాసంలో గ్రామ దేవతలకు మహిళలు భక్తిశ్రద్ధలతో నైవేద్యం పెట్టి మొక్కులు చెల్లించుకుంటారు.డప్పు ,వాయిద్యాలు శివసత్తుల పునకాలు,పోతరాజుల నృత్యాలతో గ్రామాల ప్రజలు బోనాల పండుగను అంగరంగ వైభవంగా జరుపుకుంటారు.ఇందులోనే భాగంగా చింతపల్లి మండలంలోని తిర్మలాపురం గ్రామంలో మంగళవారం ఘనంగా బోనాల పండుగ జరుపుకున్నారు.గ్రామంలో ఎల్లమ్మ, గ్రామ దేవతకు కులాలకు అతీతంగా బోనాలుమెత్తి ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.వర్షాలు సంవృధిగా కురావలని గ్రామలోనో ప్రతి ఒక్కరు ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి జోగ మంజుల శ్రీరాములు, వార్డు సభ్యులు గ్రామస్తులు గర్లపాటి వినోద్,సంతోష సాగర్,గర్లపాటి దివ్య ప్రవీణ్, జోగు శ్రీను,,ఆకరపు సురేందర్,తోళ్ల సైదులు,జోగు వెంకటేష్,జైపాల్, యువత,తదితరులు పాల్గొన్నారు.

# మీసేవ ఒక్కటే.. ప్రజలకు తిప్పలే తిప్పలు!

## - మోతె లో రెండో మీ సేవ కేంద్రం ఏది....

## - రెండో కేంద్రం లేక రైతులు, విద్యార్థుల అవస్థలు ....

## - ధ్రువపత్రాల కోసం రోజుల తరబడి నిరీక్షణ.....

## - వెంటనే మరో మీసేవ ఏర్పాటు చేయాలని డిమాండ్....

**మోతె సెప్టెంబర్ 8(ప్రజాజ్యోతి):**

సూర్యాపేట జిల్లా మోతె మండల కేంద్రంలో ఒకే ఒక్క మీసేవ కేంద్రం ఉండటంతో మండల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కుల, ఆదాయం, నివాస ధ్రువపత్రాలతో పాటు వివిధ ప్రభుత్వ ఆన్‌లైన్ సేవల కోసం ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు ఒకే కేంద్రాన్ని ఆశ్రయిస్తుండటంతో రద్దీ పెరుగుతోంది. ఫలితంగా అవసరమైన ధ్రువపత్రాల కోసం రైతులు, విద్యార్థులు రోజుల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది.గతంలో మండలంలో మరో మీసేవ కేంద్రం పనిచేసేది. అయితే ఆ కేంద్రం మూతపడటంతో ప్రస్తుతం మొత్తం మండల ప్రజలకు ఒకే కేంద్రం ఆధారంగా మారింది. దీంతో దరఖాస్తుల సంఖ్యపెరిగి సేవలుఆలస్యమవుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. అత్యవసరంగా ధ్రువపత్రాలు అవసరమైన విద్యార్థులు, రైతులు సమయం వృథా చేసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రజల ఇబ్బందులు పట్టించుకునేదెవరు?

ఒకే మీసేవ కేంద్రంతో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు సేవలు అందించడం కష్టంగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు.





**సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు వివరణ.....**

మండల ప్రజల అవసరాలకు అనుగుణంగా మరో మీసేవ కేంద్రాన్ని ఏర్పాటు చేసి సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మోతె మండల కేంద్రంలో వెంటనే మరో మీసేవ కేంద్రాన్ని మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు డిమాండ్ చేశారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

# కేసీఆర్ మరణాన్ని కోరే రాజకీయాలా..?

## - అనుచిత వ్యాఖ్యలు.. 10 వేల డప్పులతో ర్యాలీపై బీఆర్ఎస్ భగ్గుమంది!

## - ప్రజాస్వామ్య హద్దులు దాటారంటూ నడిగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

**నడిగూడెం, సెప్టెంబర్ 8, ప్రజా జ్యోతి:**

తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్)పై చేసినట్లు ఆరోపిస్తున్న అనుచిత వ్యాఖ్యలు, ఆయన మరణాన్ని కోరుతూ నిర్వహించిన ర్యాలీపై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారాన్ని రాజకీయంగా తీవ్రంగా ఖండిస్తూ, సంబంధిత అంశంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ నడిగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.బీఆర్ఎస్ మండల సమన్వయ సమితి కమిటీ సభ్యుడు అనంతుల ఆంజనేయులు మాట్లాడుతూ, రాజకీయ ప్రత్యర్థులను విమర్శించే హక్కు అందరికీ ఉన్నప్పటికీ, మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష పార్టీ అధినేత మరణాన్ని కోరే స్థాయికి రాజకీయాలు దిగజారడం అత్యంత దురదృష్టకరమన్నారు.“రాజకీయంగా విమర్శించండి.. విధానాలను ప్రశ్నించండి.. కానీ వ్యక్తిగతంగా ఒక నాయకుడి ప్రాణాలను కోరే రాజకీయాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం” అని పేర్కొన్నారు.కేసీఆర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు, ఆయన మరణాన్ని కోరుతూ 10 వేల డప్పులతో ర్యాలీ నిర్వహించినట్లు ఆరోపిస్తూ, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని నడిగూడెం పోలీస్‌స్టేషన్ ఎస్ఐ తేజస్వినికి పిటిషన్ అందజేశారు.కేసీఆర్‌పై రాజకీయ విమర్శలు చేయవచ్చు.. కానీ ఆయన మరణాన్ని కోరడం ప్రజాస్వామ్య హద్దులను దాటడమేనని, తెలంగాణ సమాజం ఇలాంటి రాజకీయ సంస్కృతిని అంగీకరించదని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నడిగూడెం గ్రామ శాఖ అధ్యక్షుడు బోనగిరి ఉపేందర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఎస్.కె. జలీల్, మండల ఉద్యమ నాయకులు దున్న ప్రవీణ్, నూకపంగు ఈదయ్య, శ్రీరాముల శేషు, కుంభజడ శీను, రామ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



# మృతుడి కుటుంబానికి అండగా బీజేపీ రాష్ట్ర నాయకత్వం

- లతీఫ్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన ఓర్సు వేలంగి రాజు

- కుటుంబానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉంటారని భరోసా

**నడిగూడెం, సెప్టెంబర్ 8 (ప్రజా జ్యోతి):**



బీజేపీ నడిగూడెం మండల మాజీ ఉపాధ్యక్షులు షేక్ లతీఫ్ మృతి చెందిన విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకులు ఓర్సు వేలంగి రాజు ఆయన కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ అండగా ఉంటారని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నడిగూడెం మండల అధ్యక్షులు బండారు వీరబాబు యాదవ్, అనంతగిరి మండల అధ్యక్షులు చింతకుంట్ల సతీష్, చిలుకూరు మండల అధ్యక్షులు పారేల్లి మహేష్, కోదాడ రూరల్ అధ్యక్షులు గాదరి పుల్లారావు, నడిగూడెం మండల మాజీ అధ్యక్షులు దున్న సతీష్, మండల ప్రధాన కార్యదర్శులు రౌత్ కళ్యాణ్, కేశవాణి పాపయ్య, యువమోర్చా అధ్యక్షులు చెన్నకేశ గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు బీరవెల్లి గోపాల్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిలక బాలకృష్ణ, జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి బండారు శోభారాణి, జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు తాళ్లూరి రామకృష్ణ, నాయకులు మల్సూర్, జిల్లా యువమోర్చా ఉపాధ్యక్షులు సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. ఎమ్మెల్యే శంకర్‌ను అరెస్టు చేయాలి

## వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు..

**నల్లగొండ టౌన్ సెప్టెంబర్ 8,(ప్రజా జ్యోతి):**

తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసీఆర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేయడం సరికాదని, ప్రజాప్రతినిధిగా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన ఎమ్మెల్యే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం పట్ల వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అభిమన్యు శ్రీనివాస్, మారగోని గణేష్, కార్పొరేటర్ బాణావత్ దీప్లా, గోపగోని స్వాతి, రాజశేఖర్, జమాల్ ఖాద్రి, కుందూరు ప్రవీణ్‌రెడ్డి, మాతంగి అమర్, శంషోద్దీన్, వజ్జే శ్రీనివాస్, సత్యనారాయణగౌడ్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

- డీజేలకు అనుమతి లేదు.. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు..

- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

**నల్గొండ సెప్టెంబర్ 8,(ప్రజా జ్యోతి):**



వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను జిల్లాలో భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు. ఉత్సవాల్లో డీజేలు, అధిక శబ్దం చేసే సౌండ్ సిస్టమ్‌లకు అనుమతి లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్పీకర్లను తక్కువ శబ్దంతో రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలన్నారు. విగ్రహాలను ప్రజలకు, వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేయాలని, విద్యుత్ కనెక్షన్లు సంబంధిత శాఖ అనుమతితోనే తీసుకోవాలని సూచించారు. ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు, వాలంటీర్లను ఏర్పాటు చేసి భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు. మద్యం, పేకాట, అసభ్యకర కార్యక్రమాలు, ఇతర మతాల మనోభావాలను దెబ్బతీసే ప్రసంగాలు, పాటలు పూర్తిగా నిషేధమన్నారు. సోషల్ మీడియాలో వదంతులు, ఇతర మతాల మనోభావాలను దెబ్బతీసే పోస్టులపై ప్రత్యేక మానిటరింగ్ ఉంటుందని, అలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ తెలిపారు. మండప నిర్వాహకులు పోలీస్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి, సంబంధిత పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు అందజేయాలని సూచించారు. ఉత్సవ కమిటీలు పోలీసుల సూచనలు పాటిస్తూ సహకరించాలని కోరారు.

# హియరింగ్‌కు ముందే ధ్రువపత్రాల వివరాలు తెలియజేయాలి

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 08(ప్రజా జ్యోతి):**

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లకు హియరింగ్‌కు హాజరయ్యే ముందే సమర్పించాల్సిన ధ్రువపత్రాల వివరాలను తెలియజేస్తే విచారణ ప్రక్రియ సులభంగా పూర్తవుతుందని నల్గొండ జిల్లా ఎన్నికల ఓటరు జాబితా పరిశీలకురాలు,రాష్ట్ర ఉన్నత విద్య కమిషనర్ ఏ.దేవసేన అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లోని బీఎల్ఓలు, బీఎల్ఏలతో మాట్లాడి పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్ల సంఖ్య, మ్యాపింగ్ కాని ఓటర్లు, ఓటరు జాబితాలో తేడాలున్న వారికి జారీ చేసిన నోటీసులు, హియరింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీదేవసేన మాట్లాడుతూ ఓటరుకు నోటీసు ఎందుకు జారీ చేశారో, అందుకు ప్రతిగా వారు ఎలాంటి ధ్రువపత్రాలు సమర్పించాలో హియరింగ్‌కు ముందే స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. దీంతో హియరింగ్ రోజున అవసరమైన ధ్రువపత్రాలతో ఓటర్లు హాజరయ్యే అవకాశం ఉంటుందని, తద్వారా విచారణ ప్రక్రియ సులభంగా పూర్తవుతుందని తెలిపారు. నోటీసుల జారీ ప్రక్రియను సక్రమంగా నిర్వహించేందుకు బీఎల్ఏలు, బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లాలని సూచించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు అడిగినప్పుడు వారికి అవసరమైన ధ్రువపత్రాల వివరాలను తెలియజేసే స్థాయిలో బీఎల్ఓలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. నోటీసులు జనరేట్ అయిన ప్రతి ఓటరుకు తప్పనిసరిగా నోటీసు అందజేయాలని,ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని తమ వద్దే ఉంచుకోకూడదని అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో ఆర్డీఓ వేణు మాధవరావు, తహసీల్దార్ సాయి గౌడ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

